ధాన్యం కొనుగోళ్లు అ'ద్వితీయ'ం




రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని రైసుమిల్లులకు చేరుస్తున్న అధికారులు



ధాన్యం పట్టుబడి చేస్తున్న రైతులకు సూచలిస్తున్న ఆర్బీకే అధికారి

అన్నదాతకు అండగా..
- పారదర్శకంగా కొనుగోళ్ల ప్రక్రియ
- వర్షాల నుంచి రైతులను గట్టెక్కించిన ప్రభుత్వం
- రెండో స్థానంలో నిలిచిన ఉండి

ఉండి: రైతు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ప్రభుత్వం అన్నింటా అండగా నిలుస్తోంది. ఈ రబీ సీజన్‌లో రైతులను రాష్ట్ర ప్రభుత్వం గట్టెక్కించింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా వ్యవసాయాధికారులు రైతులకు సాయం అందిస్తున్నారు. ప్రభుత్వ ప్రణాళికల ద్వారా అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించి ప్రతి ధాన్యం గింజనూ రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. అకాల వర్షాలు, ఈదురు గాలులతో వరి పంటకు నష్టం వాటిల్లకుండా రైతులను అప్రమత్తం చేస్తూ ధాన్యం సేకరణ చేపట్టారు. ఈ క్రమంలో జిల్లాలో ఉండి మండలం ధాన్యం కొనుగోళ్లలో రెండో స్థానంలో నిలిచింది.

ఎప్పటికప్పుడు అండగా నిలుస్తూ..

ఉండి మండలంలో 34,324 టన్నుల ధాన్యం (96.37 శాతం) కొనుగోలు చేసి జిల్లాలో రెండో స్థానంలో నిలిచింది. అలాగే ఆకివీడు మండలంలో 12,551 టన్నులతో 82 శాతం, కాళ్ల మండలంలో 10,941 టన్నులతో 87 శాతం, పాలకోడేరు మండలంలో 31,650 టన్నులతో 85 శాతం చొప్పున ధాన్యం కొనుగోళ్ల లక్ష్యాన్ని అధికారులు పూర్తిచేశారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు సూచనలందిస్తూ ప్రకృతి విపత్తులు, వర్షాల నుంచి పంటలను కాపాడుతున్నారు. దీంతో కొద్దిరోజులుగా జిల్లాలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్నా రైతులకు ఎటువంటి ఇబ్బందులు ఉండటం లేదు.

దళారుల బెడద లేకుండా..

గతంలో దళారుల బెడదతో ధాన్యం విక్రయాల్లో రైతులు తీవ్రంగా నష్టపోయేవారు. జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టిన తర్వాత దళారులు, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు ప్రక్రియను చేపట్టారు. అధికారులే రైతుల కళ్లాల వద్దకు వెళ్లి ధాన్యం కొనుగోలు చేసి నిర్ణీత సమయంలోపు వారి ఖాతాలకు ధాన్యం సొమ్ములు జమచేస్తున్నారు. రవాణా, గోనె సంచులు, కూలీ ఖర్చులను ప్రభుత్వమే భరిస్తోంది. అలాగే రైతులకు గిట్టుబాటు ధర అందిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది.

రైతులను ఆదుకున్నారు



గతంలో పంట చేతికొచ్చాక అమ్మాలంటే చాలా ఇబ్బంది పడేవాళ్లం. అయితే ఇప్పుడు నేరుగా అధికారులే చేలోకి వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తుంటే చాలా సంతోషంగా ఉంది. అలాగే ధాన్యం అమ్మకం కొరకు అధికారులు ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తే మాకు మంచి మద్దతు ధర లభిస్తుంది. ఈ విధంగా ప్రభుత్వం అండగా ఉంటే అన్నదాతలు మరిన్ని మంచి దిగుబడులు సాధిస్తారు.

–భైరెడ్డి వెంకట్రావు, రైతు, ఉండి

మరింత లాభం



ధాన్యం కొనుగోలు కోసం రాష్ట్ర ప్రభుత్వం కచ్చితమైన ప్రమాణాలు పాటిస్తూ అండగా ఉండటం చాలా సంతోషం. మద్దతు ధరలు ఇవ్వడంతో పాటు అవినీతికి తావులేకుండా అధికారులు అండగా ఉంటున్నారు. గతంలో పంట చేతికొస్తే భయంగా ఉండేది. దళారుల బెడద ఎక్కువగా ఉండేది. ఇప్పుడు ఆ బాధలు లేవు. వర్షాలు, విపత్తుల నుంచి కూడా రైతులు పంటను కాపాడుకోగలుగుతున్నారు.

–గేదెల నాగేశ్వరరావు, రైతు, ఉండి

అన్నివిధాలా సహకారం



నారు పోసిన నాటి నుంచి ఆర్బీకేల ద్వారా రైతులకు అన్నివిధాలా వ్యవసాయ అధికారులు అండగా ఉంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వ సూచనల మేరకు ఉన్నతాధికారుల ఆదేశాలతో రైతులకు సంక్షేమంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందిస్తున్నాం. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతుల ముంగిటకే అన్ని సదుపాయాలు అందిస్తున్నాం. దీంతో రైతులంతా చాలా సంతోషంగా ఉన్నారు.

–బి.సంధ్య, మండల వ్యవసాయాధికారి, ఉండి

శరవేగంగా 'జలజీవన్' పనులు

- నియోజకవర్గంలో 18 ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం
- మొత్తం 153 పనులకుగాను 61 పనులు పూర్తి
- టెండర్ల దశలో మరో 141 పనులు

ఆకివీడు: శివారు ప్రాంతాల్లో సైతం ప్రతి ఇంటికీ మంచినీటిని కుళాయిల ద్వారా అందజేయాలనే దక్పథంతో కేంద్ర ప్రభుత్వ జల శక్తి మంత్రిత్వ శాఖ 2019లో జలజీవన్ మిషన్ ప్రారంభించింది. కోవిడ్ ప్రభావంతో ఈ పథకం అమలు మూడేళ్లు వెనక్కి వెళ్లినా.. గత ఏడాదిన్నర కాలంగా జల్‌జీవన్ మిషన్ ద్వారా మంజూరైన పథకాల పనులు శరవేగంగా జరుగుతున్నాయి. పల్లెలకు, శివారు ప్రాంతాలకు పైప్‌లైన్ల విస్తరణ, ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణం, సంప్‌ల నిర్మాణంను వేగవంతంగా పూర్తి చేస్తున్నారు.

నియోజకవర్గంలో 153 పనులు ప్రారంభం

జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా ఉండి నియోజకవర్గంలో మంజూరైన 153 పనుల్లో ఇప్పటికే 61 పనులను పూర్తి చేశారు. అలాగే 18 ఓహెచ్‌ఎస్‌ఆర్‌ల నిర్మాణాలకు అనుమతులు రాగా ఇందులో కాళ్ల 6, ఉండి 6, పాలకోడేరుకు 6 ఉన్నాయి. 14 ఓహెచ్‌ఎస్‌ఆర్‌లను ఇప్పటికే పూర్తిచేయగా మరో 4 నిర్మాణ దశలో ఉన్నాయి. పైప్‌లైన్ల నిర్మాణం, సంప్‌లు, ఓహెచ్‌ఎస్‌ఆర్‌లు, ఫిల్టర్‌బెడ్‌లు తదితర వాటి నిర్మాణం వేగంగా జరుగుతోంది. ఆయా పనులు పూర్తి చేసేందుకు రూ.87.52 కోట్లు విడుదల చేశారు.

టెండర్ల దశలో మరో 141 పనులు

నియోజకవర్గంలో మంజూరైన మరో 141 పనులు ఎన్నికల కోడ్ రావడంతో టెండర్ల దశలో నిలిచిపోయాయి. టెండర్ల విధానానికి స్వస్తి పలికి కమ్యూనిటీ కాంటాక్టు సిస్టమ్ (సీసీఎస్) ద్వారా చేయించేందుకు ప్రభుత్వం యోచిస్తుంది. నూతన ప్రభుత్వం తీసుకోబోయే చర్యలతో ఆయా పనులు ఏ విధంగా చేపట్టాలో సంబంధిత శాఖ అధికారులకు ఉత్తర్వుల ద్వారా ఆదేశాలు వస్తాయి. నవంబర్ నాటికి జల్ జీవన్ పనుల్ని దాదాపుగా పూర్తి చేయాల్సి ఉంది.



పాలకోడేరు మండలం వెంప గ్రామంలో మినీ రక్షిత నీటి పథకం నుంచి పైప్‌లైన్ల ద్వారా కుళాయి నీరు సరఫరా



కోలమూరులో పైప్‌లైన్ నిర్మాణం



పెరికిపాలెంలో పూర్తయిన ఓహెచ్‌ఎస్‌ఆర్



కాళింగగూడెంలో కుళాయి నీరు ఇలా..

విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

ఉండి: ఇటీవల వెలువడిన పదో తరగతి పరీక్షల్లో మండలస్థాయి విజేతలైన విద్యార్థులకు మానవత స్వచ్ఛంద సేవాసంస్థ ఉండి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ పాఠశాల పరిధిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన డి రమ్య (575 మార్కులు), బీ సుభాషిణి (573 మార్కులు), ఎం గణేష్‌కు (569 మార్కులు) పురస్కారాలు అందజేశారు. అలాగే ప్రైవేటు పాఠశాలల పరిధిలో మానే చాతుర్య (590 మార్కులు)కు ప్రతిభా పురస్కారాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎస్ రవీంద్ర, ఎంఈవో–2 బీ వినాయకుడు, మానవత మండలాధ్యక్షుడు కట్రెడ్డి సత్యనారాయణ, పెన్మెత్స రామకృష్ణంరాజు, కొమ్మన నాగబాబు, దంగేటి రామలింగేశ్వరరావు, గంధం ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పురస్కారాలు అందిస్తున్న మానవత ప్రతినిధులు

వైభవంగా శ్రీవారి రథోత్సవం



శ్రీవారికి రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం జువ్వలపాలెం రోడ్డులో వేంచేసియున్న శ్రీపద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి వారి వార్షిక కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం శ్రీవారి రథోత్సవం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పద్మావతి అమ్మవారికి సామూహిక లక్ష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన చైర్మన్ మంతెన రామ్‌కుమార్ రాజు, ఆలయ కార్యనిర్వహణ అధికారి రుద్రరాజు గంగాశ్రీదేవి, ధర్మకర్తలు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గం ఏర్పాటు

భీమవరం అర్బన్: భీమవరం మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడిగా పత్రిపాటి శ్రీను, ప్రధాన కార్యదర్శిగా సత్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. భీమవరంలోని మండల ఆర్యవైశ్య సంఘం బుధవారం నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కోశాధికారిగా శ్రీకాంత్, సభ్యులుగా సోము కపర్థి, మండ వెంకయ్య, బచ్చు కాశీ, బలబద్ర బాబి, జూలూరు నాగేశ్వరరావు, పత్రిపాటి వెంకటపుల్లారావు, ఆలమూరు మల్లికార్జునరావు, ఒబిలిశెట్టి రంగారావు, సబ్బిశెట్టి రాంబాబు, మండవల్లి సత్యనారాయణ, సోము రంగప్రసాద్, జూలూరి బాల బాలాజీ, తవ్వ సాయి సభ్యులుగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన పాలకవర్గం 2024–2026 వరకు కొనసాగుతుందని సంఘ అధ్యక్షుడు పత్రిపాటి శ్రీను తెలిపారు. పాలకవర్గ సభ్యులను పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు, ప్రజాప్రతినిధులు అభినందించారు.



ఎన్నికైన ఆర్యవైశ్య సంఘం కార్యవర్గ సభ్యులు

వాహనాల గుర్తింపునకు స్పెషల్ డ్రైవ్

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నెంబర్ లేని వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేస్తున్నామని పట్టణ ఎస్సై బాదం శ్రీనివాస్ తెలిపారు. బుధవారం స్థానిక లక్ష్మీనగర్‌లో ద్విచక్రవాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాస్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఫలితాలు ముగింపు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం ముందస్తు చర్యల్లో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపడుతున్నామన్నారు. నెంబర్లు లేని వాహనాలను గుర్తించి వాటిని స్టేషన్‌కు తరలిస్తున్నామని తెలిపారు. సంబంధింత వాహన యజమానులు తమ వాహనానికి సంబంధించిన రికార్డులు తీసుకువస్తే వాటిని పరిశీలించి రికార్డులు సరిపోతే ఆ యజమానులకు వాహనాలను అందజేస్తున్నామన్నారు. లేదంటే వాహనాలను సీజ్ చేస్తున్నట్లు చెప్పారు. అలాగే బాటిల్‌లో పెట్రోలు కొట్టించడం, బాణసంచా కాల్చడం కూడా నిషేధించామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు తగిన కారణాలు చూపించకుండా నియోజకవర్గంలో ఉండకూడదని సూచించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో ఏఎస్సైలు ఏసుబాబు, మార్‌లింగం, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ చేస్తున్న పోలీసులు

విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

కాళ్ల: భైర్రాజు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాళ్ళ మండలం జువ్వలపాలెం గ్రామంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. బుధవారం ఫౌండేషన్ కార్యాలయంలో శిక్షణలో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ శిక్షణా తరగతుల్లో మూడో తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు 270 మంది పాల్గొన్నారని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు. వారికి కంప్యూటర్‌పై ప్రాథమిక అవగాహన, యోగా, గణితంలో మెలకువలపై శిక్షణ అందించామన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గ్రామ వికాస సమితి కన్వీనర్ గోకరాజు వినోద రంగరాజు, కోఆర్డినేటర్లు ఎం రామకృష్ణంరాజు, పెనుమాకు భానుమూర్తి, నంబూరి శివవర్మ తదితరులు పాల్గొన్నారు.



వేసవి శిక్షణ తరగతుల్లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

క్లుప్తంగా

ప్రజల ఆశీర్వాదంతో వైఎస్సార్ సీపీ గెలుపు తథ్యం



జి.సుందర్‌కుమార్

ఉండి: ప్రజల ఆశీస్సులతో రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఉండి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజు గెలుపు ఖాయమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు జీ సుందర్‌కుమార్ బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. కేవలం ప్రచార ఆర్భాటంతో ప్రజలను మరింత తికమక పెట్టేలా కూటమి పార్టీలు వ్యవహరిస్తున్నాయని అన్నారు. కూటమి పార్టీలకు ఓటమి ఖాయమన్న సంగతి ముందే తెలిసి ప్రజల ముందు చులకన కాకుండా ఉండేందుకు, వారిని నమ్ముకున్న వారిని మరింతగా ముంచేందుకు కల్లబొల్లి ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. మరోసారి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేస్తారని, ఉండి టీడీపీ కంచుకోటను పగులగొట్టి ఎమ్మెల్యేగా పీవీఎల్ నరసింహరాజు గెలిచి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

నరసింహస్వామికి లక్ష తులసి పూజ



కొంతేరులో లక్ష తులసి పూజ చేస్తున్న అర్చకులు

యలమంచిలి: కొంతేరు గ్రామంలోని శ్రీ కుంతీ లక్ష్మీ నరసింహ స్వామి జయంతి సందర్భంగా బుధవారం ఆలయంలో దేవేరులకు లక్ష తులసి పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలపల్లి వేణునాథ్ ఆధ్వర్యంలో వేద పండితులు శాస్త్రోక్తంగా పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి విచ్చేసి దేవేరులను దర్శించుకున్నారు. భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మామిడిశెట్టి వీర వెంకట శ్రీనివాస్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన నమ్మాళ్వార్ ఉత్సవాలు



కోవెల మాడవీధుల్లో ఊరేగుతున్న నమ్మాళ్వార్లు

నరసాపురం రూరల్: శ్రీ ఆదికేశవ ఎంబేరుమనార్ స్వామివారి ఆలయంలో గత ఐదు రోజులుగా జరుగుతున్న నమ్మాళ్వార్ ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ ఉత్సవాలను పురస్కరించుకుని ఉదయం సాయంత్రం వేళల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముగింపు ఉత్సవాలను పురస్కరించుకుని ఆళ్వార్లను ఆలయ మాడవీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ ఈవో చాగంటి సురేష్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఇష్టానుసారంగా వాహనాల నిలిపివేతతో ఇబ్బందులు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌రోడ్‌లో ఇష్టానుసారం ప్రైవేట్ వాహనాలు నిలిపి ఉంచడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. రైల్వే స్టేషన్‌రోడ్‌లో ఇటీవల కాలంలో రద్దీ బాగా పెరిగింది. పాలకొల్లు రోడ్ విపరీతమైన రద్దీతో ఉండటంతో, చాలామంది ప్రత్యామ్నాయంగా, ఈ రోడ్‌లో ప్రయాణిస్తున్నారు. ఇటీవల స్టేషన్ పక్క నుంచి సరిపల్లి మీదుగా బైపాస్ కూడా నిర్మించారు. దీంతో రద్దీ బాగా పెరిగింది. అయితే ఈ రోడ్‌లో ప్రైవేట్ బస్సులు, రొయ్యల కంపెనీలకు సంబంధించిన ఇతర ప్రైవేట్ వాహనాలను ఇరువైపులా నిలిపి ఉంచుతున్నారు. అందువల్ల ఈ రోడ్డులో ప్రయాణించే వారికి సమస్యలు వస్తున్నాయి. అధికారులు ఇప్పటికైనా స్పందించి వాహనాలను రోడ్డుపై నిలిపి ఉంచకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గోదావరికి పంచ హారతులు



సిద్ధాంతం కేదారీఘాట్‌లో గోదావరి మాతకు హారతులు

పెనుగొండ: పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతంలోని కేదారీఘాట్ వద్ద గోదావరి పంచహారతులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం రాత్రి హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో కలగ భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో వంగూరి రామకృష్ణ, శేషకుమారి దంపతులు వశిష్ఠ గోదావరికి పంచ హారతులు ఇచ్చారు. ఏకముఖ, ద్విముఖ చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర పూర్ణ, కుంభ, సర్ప హారతులు ఇచ్చారు. హిందూ ధర్మ పరిరక్షణ సమితి సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భీమవరం అర్బన్: భీమవరం మండలంలోని గొల్లవానితిప్ప విద్యుత్ ఉపకేంద్ర పరిధిలో 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ వైర్లపై చెట్ల కొమ్మలు తొలగించుట, వార్షిక మరమ్మతుల నిమిత్తం గురువారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయ కలుగుతుందని ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్‌ఖాన్ బుధవారం తెలిపారు. గొల్లవానితిప్ప, ఎల్‌వీఎన్ పురం, ఈలంపూడి, పల్లిపాలెం గ్రామాలతో పాటు దిరుసుమర్రు ఇండస్ట్రీయల్ లైన్లకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఫాస్ట్ పాసింజర్‌ను పునరుద్ధరించాలని వినతి

ఉండి: నర్సాపురం, గుంటూరు ఫాస్ట్ పాసింజర్ (ఎక్స్‌ప్రెస్)ను రైల్వే అధికారులు వెంటనే పునరుద్ధరించాలని రైల్వే అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు ఉండి రైల్వే ప్రయాణికుల సంఘ నాయకులు కొమ్మన నాగబాబు, సీహెచ్ బంగార్రావు బుధవారం తెలిపారు. డెల్టా వాసులకు విజయవాడ, గుంటూర్ వంటి ప్రాంతాలకు ఉదయాన్నే వెళ్లేందుకు ఫాస్ట్ ప్యాసింజర్ ఒక్కటే ఆధారంగా ఉండేదని, అటువంటి రైలును వివిధ కారణాలతో నిలిపివేయడం వలన ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. రైల్వే అధికారులు జోక్యం చేసుకుని ఈ రైలును పునరుద్ధరించాలని కోరినట్లు తెలిపారు. లేనిపక్షాన కనీసం విజయవాడ వరకైనా మరో ప్రత్యామ్నాయంగా మచిలీపట్నం రైలును విజయవాడ వరకు కొనసాగించాలని కోరినట్లు తెలిపామన్నారు. అలాగే రైల్వే ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రజాప్రతినిధులు కూడా స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరినట్లు వారు తెలిపారు.

పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాలి



యోగా శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు

నరసాపురం: పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి పెంచాల్సిన అవసరం ఉందని నరసాపురం గ్రేడ్–1 గ్రంథాలయ లైబ్రేరియన్ కేజేఎస్ఎల్ కుమారి అన్నారు. గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిక్షణ శిబిరంలో బుధవారం పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. తరువాత కథలు చెప్పడం, యోగా, లెక్కల సబ్జెక్ట్‌లో మెళుకువలు చేర్పించారు. ఈ సందర్భంగా కుమారి మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. జూన్ 7 వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ స్కూల్ హెచ్‌ఎం కె.వెంకటేశ్వరరావు, సుధీర్‌మోహన్, సూర్యంబాబు, జి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



అఖండ సాయి నామ సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

యలమంచిలి: అడవిపాలెం గ్రామంలోని సాయి విఠల్ మందిర్ 21వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయిబాబా ఉత్సవ విగ్రహానికి గ్రామోత్సవం, పుష్పాభిషేకం నిర్వహించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి గురువారం తెల్లవారుజామున ఆరు గంటల వరకు 12 గంటలపాటు నిరాటంకంగా ఓం సాయి శ్రీ సాయి జయ జయ సాయి అఖండ సాయి నామ సంకీర్తన నిర్వహించారు. గురువారం కాగడ హారతి, సుప్రభాత సేవ, బాబాకు అభిషేకం, సాయి సత్య వ్రతం, విరాట్ సాయి స్తోత్ర పఠనం, చందనోత్సవం నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు పిల్ల విజయ గోపాలకృష్ణ తెలిపారు. సాయి సత్య వ్రతంలో పాల్గొనాలనుకునే భక్తులు పూజా ద్రవ్యాలతో ఆలయానికి హాజరుకావాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా భక్తులకు గురువారం మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆయన చెప్పారు.